క్లుప్తంగా

యోగాతో మానసిక ప్రశాంతత



బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా మాస్టర్ మల్లేశం అన్నారు. శుక్రవారం మండలంలోని కొడవటూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అచల యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత యోగా తరగతులను నిర్వహించారు. విద్యార్థులకు సులువుగా వేసే పలు ఆసనాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ యోగా చేయడం వలన విద్యార్థులు చదువుపై మనస్సును కేంద్రీకరించొచ్చని తెలిపారు. చదివిన పాఠాలు కూడా గుర్తుకు ఉంటాయని తెలిపారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత యోగా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బందారం లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కొడవటూర్, కట్కూర్, కొన్నె, పోచన్నపేట, బచ్చన్నపేట గ్రామాల్లోని పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వినయ్ బాబుకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షులు అంకుషావళి, కార్యదర్శి యాదగిరి, నాయకులు శ్రీనివాస్, అంబదాస్, రవీందర్‌రెడ్డి, యాదగిరి, నరేష్, శ్రీరాం, గిరీషం, సుభాష్, కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

జఫర్‌గఢ్: పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ రడపాక సుదర్శన్ పేర్కొన్నారు. మండలంలోని తమ్మడపల్లి (ఐ) ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా మంజూరైన నూతన భవన నిర్మాణ పనులను ఎంపీపీ శుక్రవారం ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వ మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, సర్పంచ్ గాదెపాక అనిత సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

బాక్సింగ్ కిట్ల అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక రాజు ఫిట్‌నెస్ అకాడమీకి చెందిన పూర్వ విద్యార్థులు ఈ.శివప్రసాద్ (ఆర్మీ క్లర్క్), ఎ.ఓంకార్(నేవీ ఉద్యోగి), జి.వివేక్(ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి) అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు తమవంతుగా బాక్సింగ్ కిట్స్, ప్యాడ్స్, గ్లౌజులు అందించారు. ఈమేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోచ్ రాజు మాట్లాడుతూ తమ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు దేశ సేవ చేసే ఉద్యోగాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మల్లేష్, రమేష్, రాజన్న, అజయ్, రవితేజ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

బచ్చన్నపేట: జిల్లాలోని అన్ని మండలాల్లోని కబ్రస్తాన్ భూములను గుర్తించి ఆ స్థలంలో నిర్మించిన నిర్మాణాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మైనార్టీ నాయకులు, సామాజిక సేవా కర్త మహమ్మద్ యాకూబ్ పాషా అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని నారాయణపురంలోని కబ్రస్తాన్ భూమిని పరిశీలించామన్నారు. ఈ భూమిలోకి మురుగు నీరు వస్తుందని, నివారణ చర్యలు చేపట్టాలని సర్పంచ్‌ను కోరారు. కబ్రస్తాన్ భూముల చుట్టూ పెన్సింగ్ వసతులను బ్యాంకు రుణాల ద్వారా కల్పించాలని, ఈ కార్యక్రమంలో నాయకులు ముజాహిద్ పాషా, రహిమాన్, అబ్బాస్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

పాలకుర్తి: కంటి వెలుగు కార్యక్రమంతో ప్రజలకు మేలు కలుగుతుందని సర్పంచ్ మల్లాల సరిత పర్శరాములు, ఎంపీటీసీ సోమయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణపురంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కంటి వైద్యులు పాల్గొన్నారు.

సన్మానం

దేవరుప్పుల : మండలంలోని పడమటితండాలో కంటి వెలుగులు కల్పించేందుకు తోడ్పాటు అందించిన వైద్య బృందాన్ని గ్రామ పంచాయతీ సర్పంచ్ కొక్యానాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం తలపెట్టిన శిబిరాలను ప్రజలకు ఉపయోగపడేలా సేవలందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు మనోజ్, డీఈఓ ఎండీ జావీద్, ఆప్తమాలిజిస్ట్ రూన్సీరాణి, ఎఎన్ఎం సమత, మేల్ అసిస్టెంట్ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి అశ్విని, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రి బాయి జీవితం ఆదర్శనీయం



జనగామ రూరల్: సావిత్రి బాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పాలకుర్తిలో..

జనగామ రూరల్: సావిత్రి బాయి పూలే జీవితం ఆదర్శనీయం అని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు మారేడు వినోద్, ధర్మభిక్షం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సావిత్రి బాయి 126వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. సావిత్రి పూలే జీవితం ఎందరో మహిళలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో దండిగే సందీప్, సురేష్, విష్ణు, కల్యాణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చౌడారం కేజీబీవీలో..

చదువుల తల్లి సావిత్రి బాయి పూలే 126వ వర్ధంతిని సందర్భంగా మండలంలోని చౌడారం కేజీబీవీ పాఠశాల్లో ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా దాత దళిత రత్న అవార్డు గ్రహీత పర్శరాములు సహకారంతో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీలో సావిత్రి బాయి పూలే ఫౌండర్ యాసారపు కర్నాకర్, ముక్క విష్ణు, కృష్ణం రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి మహిళ..

పాలకుర్తి: మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి మహిళ సావిత్రి భాయి పూలే అని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల శేఖర్ అన్నారు. శుక్రవారం సావిత్రి భాయిపూలే 126వ వర్ధంతిని పురస్కరించుకుని రాజీవ్ చౌరస్తాలో నివాళులర్పించారు. కుల మతాలకు అతీతంగా తన భర్త జ్యోతిభా పూలే పోరాటాన్ని సావిత్రి భాయి పూలే ఏకీభవించారు. సావిత్రి భాయి పూణేలో మొదటి సారిగా మహిళల కోసం పాఠశాలను ప్రారంభించినట్లు వివరించారు. కేంద్రంలో ప్రధాని మోదీ ఏక పక్షంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న, ప్రజా సంఘాల నాయకులు కాకర్ల రమేష్, ఉప్పలయ్య, సోమన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రఘునాథపల్లి: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుర్చపల్లి, రఘునాథల్లిలో ఏప్రిల్ 5న ఢిల్లీలోతలపెట్టిన కార్మిక, కర్షకుల బహిరంగ సభ కరపత్రాలను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలో కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బైరగోని బాలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు, రైతులకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిందని, కనీస మద్దతు ధరల చట్టం కూడా అమలు చేయలేదని. గ్రామీణ ఉపాధి పథకం పనుల్లో కోత పెట్టిందన్నారు. బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు సాధించుకున్న 27 కార్మిక చట్టాలను రద్దు చేసి పనిగంటల విధానాన్ని పెంచారని ఆరోపించారు. సుప్రీం కోర్టు చెప్పిన విధంగా కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక, కర్షకుల సమస్యలపై నిర్వహించనున్న సభకు రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదునూరి వెంకటరాజం, నాయకులు పొదల నాగరాజు, గంగాపురం మహేందర్, కాసాని పుల్లయ్య, మంచాల మల్లేష్, శ్రీనివాస్, దాసు, యాదగిరి, లక్ష్మయ్య, నాగరాజు, అబ్బాస్, వెంకటయ్య, నరేష్, గణేష్ పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

జనగామ రూరల్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఫొటోను భారత కరెన్సీపై ముద్రించాలని ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరుపోతుల పరుశురామ్ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి, ఎంపీ కవితకు వినతి పత్రం అందజేశారు. ఈనెల మార్చి 13న ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెడితే సహకరించాలని కోరారు.

న్యాయం జరిగే వరకు పోరాటం



తాటిచెట్లను పరిశీలిస్తున్న ఉప్పలయ్యగౌడ్

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లిలో కల్లుగీత కార్మికులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్యగౌడ్ అన్నారు. మండలంలోని శివునిపల్లిలో ఇటీవల అక్రమంగా నరికి కాల్చిన తాటి, ఈత చెట్లను శుక్రవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. తాటి, ఈత చెట్లను అక్రమంగా నరికి కల్లుగీత కార్మికులకు ఉపాధి కోల్పోయేలా చేశారన్నారు. గౌడ కులానికి చెందిన ఎందరో యువకులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో కల్లుగీత వృత్తి చేస్తున్నారని, అయితే అక్రమంగా ఈత, తాటిచెట్లను నరికివేయడంతో వారికి ఉపాధి అవకాశాలు లేకుండాపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వంగ శ్రీనివాస్, వంగ వేణు, వంగ యాదగిరి, నారాయణ, కుమార్, ప్రభాకర్, సురేష్, తిరుపతి, ఎల్లగౌడ్, అశోక్, మహేందర్ పాల్గొన్నారు.

ప్రవర్తన మారకుంటే చర్యలు తప్పవు



ఉపేందర్ కల్లుతాగుతున్న దృశ్యాలను విలేకరులకు చూపిస్తున్న ఏసీపీ

దేవరుప్పుల : గోప్యానాయక్ తండా వాసి బానోతు ఉపేందర్ నాయక్ ప్రవర్తన మారకుంటే పీడీయాక్టు అనివార్యమని వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాసారావు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఇటీవల ఓ కేసులో రిమాండు సందర్భంగా ఉపేందర్‌నాయక్ హైడ్రామాను తీవ్రంగా ఖండించారు. మండలంలోని ధారావతండా పరిధి గోప్యనాయక్ తన నలుగురు కొడుకులకు 12 ఎకరాల చొప్పున భూమిపంచి ఆయన తండా పేరుగా నామకరణం చేశారు. ఈ క్రమంలోనే ఇద్దరు కొడుకుల వారసత్వం సంఖ్య పెరిగే క్రమంలో మరో ఇద్దరి కుటుంబాలతో మమేకమై తరచూ భూవివాదాల పేరిట ఉపేందర్ గొడవలు, దాడులు సృష్టిస్తూ తండాలో అశాంతికి ప్రేరేపిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన పేరు మీద ఇప్పటికే ఆరు కేసులు నమోదుకాగా రౌడీషీటర్‌గా నమోదు చేసినట్లు చెప్పారు. మార్చి 1న నమోదైన కేసులో కోర్టుకు రిమాండు చేయాల్సి ఉండగా పలు దఫాలుగా కౌన్సిలింగ్ ఇచ్చినా మారలేదని, నిబంధనల మేరకు ఆస్పత్రిలో వైద్యచికిత్సల కోసం తీసుకెళితే కట్టు కథలు అల్లి మీడియాను తప్పుదోవ పట్టించి పోలీసు శాఖపై అభాండాలు వేయడం సరికాదన్నారు. తమ వల్ల అనారోగ్యం పాలైతే ఒక్క రోజులోనే కల్లు మండువాలో కల్లుఎలా తాగుతాడని ప్రశ్నిస్తూ.. అందుకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. ఈ సమావేశంలో పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్, ఎస్సై మునావత్ రమేష్‌నాయక్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే రాజయ్యపై కేసు నమోదు చేయాలి

- పోలీస్‌స్టేషన్లలో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



రఘునాథపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న జ్యోత్స్న

జనగామ/రఘునాథపల్లి/స్టేషన్‌ఘన్‌పూర్/: దళిత సామాజిక వర్గానికి చెందిన ధర్మసాగర్ మండలం జానకీపురం మహిళా సర్పంచ్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యపై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న వ్యక్తి వ్యవహరించిన తీరు ఆక్షేపణీయమని, ఎమ్మెల్యే తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని మహిళా నాయకులు డిమాండ్ చేశారు.

- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కొంతకాలంగా మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని, ఓ సర్పంచ్ మీడియా ముందుకు రావడం తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేయకుంటే నియోజకవర్గంలో ఎక్కడా తిరగనివ్వబోమని స్పష్టం చేశారు.
- కాంగ్రెస్ పార్టీ రఘునాథపల్లి మండల మహిళా నేతలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి బాధితురాలికి న్యాయం చేయాలని తుమ్మ విజయమేరి, పేర్ని ఉషారవి, బిర్రు లక్ష్మీనర్సింహులు, తాళ్లపల్లి ఎలిషా కోరారు. కోళ్ల రవిగౌడ్, మేకల నరేందర్, కావటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.
- మహిళా కాంగ్రెస్ స్టేషన్‌ఘన్‌పూర్ మండల అధ్యక్షురాలు చింత జ్యోత్స్న ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం, నేతలు మహిళలను కించపరిచేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలో మహిళలకు రక్షణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రాజయ్య తక్షణమే పదవికి రాజీనామా చేయకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నారగోని పద్మ, ఐలపాక శ్రీనివాస్, మారపాక వసంత్, సింగపురం వెంకటయ్య, ఏలియా, ప్రశాంతి, సుమలత, రాంచందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న కళింగరాజు

జనగామ రూరల్: ఎమ్మెల్యే రాజయ్య తనపై లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని జానకీపురం సర్పంచ్ కుర్సపల్లి నవ్య మీడియాలో చేసిన వ్యాఖ్యలపై జనగామ ఎంపీపీ(అధికార పార్టీ నాయకుడు) మేకల కళింగ రాజు స్పందించారు. తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రజల భాగోగులు చూడాల్సిన ఎమ్మెల్యే ఒక దళిత మహిళా సర్పంచ్‌పై వేధింపులకు పాల్పడడం సరికాదన్నారు. ఈ చర్యను ప్రజాసామ్య వాదులు, ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. లైంగిక వేధింపులపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి.. నిజమని తేలితే ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలి అన్నారు. ఈ రకమైన చర్యలకు పాల్పడితే ఎవరైనా ఊరుకునేది లేదని, ముఖ్యమంత్రి స్పందించాలని కోరారు.

గ్రామ దేవతలకు బోనాలు



బచ్చన్నపేట: మండలంలోని మన్‌సాన్‌పల్లిలో దుర్గామాత ఉత్సవాల సందర్భంగా ముందస్తుగా గ్రామ దేవతలకు కులాల వారిగా బోనాలను సమర్పించినట్లు సర్పంచ్ పంజాల తార తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ గ్రామంలో పోచమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ దేవతలకు బోనాలు చెల్లించామన్నారు. నేడు(శనివారం) గ్రామస్తులంతా గ్రామంలోని దుర్గామాతకు బోనాలు సమర్పించి, రాత్రిళ్లు అక్కడే ఉంటారని తెలిపారు. అమ్మ కథాపురాణం, దుర్గామాత కల్యాణం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్సై నవీన్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చాకలి ఐలమ్మ నగర్..



ఐలమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

జనగామ: జనగామ బాణాపురం మూడో విడత ఇందిరమ్మ కాలనీకి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ నగర్‌గా నామకరణం చేసినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2012–13 సంవత్సరంలో ఇల్లు లేని నిరుపేదలకు పట్టాలు అందించి, స్థలాలు చూపించడం మరచిందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఎం అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. మూడో విడతలో డబుల్ బెడ్ రూం ఇళ్లు సాధించుకోవడానికి వీరనారి స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, శేఖర్, గోపి, ఉపేందర్, విజేందర్, కల్యాణ లింగం, మీట్యా నాయక్, వెంకట మల్లయ్య, విష్ణు, రజిత పాల్గొన్నారు.

లక్ష్యం సాధించే వరకు చదవాలి



నెల్లుట్లలో గైడ్లు అందజేస్తున్న నిట్ ప్రొఫెసర్లు

లింగాలఘణపురం: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని సాధించే వరకు నిరంతరం చదవాలని నిట్ ప్రొఫెసర్ల బృందం విద్యార్థులకు సూచించింది. శుక్రవారం మండలంలోని నెల్లుట్ల ఉన్నత పాఠశాలను నిట్ అల్యూమినీ వరంగల్ చాప్టల్ ప్రెసిడెంట్ చంద్రగిరి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ల బృందం రవికుమార్, రాధేశ్యామ్, వినోద్, అశ్వినితుంబీలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడుతూ.. చిన్న విషయాన్ని లోతుగా అర్థం చేసుకుంటే పై తరగతుల్లో సులభంగా ఉంటుందని, ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా చదవాలని సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్లు, పెన్సిల్స్, స్కేల్, ప్యాడ్‌లు అందజేశారు. ఇదిలా ఉండగా.. కస్తూర్బా పాఠశాలలో సైతం నిట్ ప్రొఫెసర్లు ఆల్ ఇన్ వన్ గైడ్లు అందజేసినట్లు స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరూపరాణి, హెడ్మాస్టర్ శ్రీనివాసు, ఉపాధ్యాయులు అరుంధతి, వాసుదేవ్, భవాని తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గానికి 1,100 మందికి దళితబంధు, గృహలక్ష్మి పథకంలో నియోజకవర్గానికి 3వేల ఇళ్లు ఇస్తామని తెలంగాణ కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ డివిజన్‌కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి శుక్రవారం పాలాభిషేకం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి మాట్లాడారు. దళితులు సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ దళితుల పాలిట దైవంలా దళితబంధు పథకాన్ని తీసుకొచ్చారన్నారు. పేదలకు స్వంత ఇంటి కల నెరవేర్చేలా గృహలక్ష్మి పథకాన్ని చేపట్టారన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు పలువురు విద్యార్థులు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌సిప్‌నకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ పర్వేజ్ తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తోకల కేజీయ, వేముల స్రవంతి, గన్నారపు లిఖిత ప్రియ, ఇల్లందుల నైతిక ఈ సంవత్సరం ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన ఒక్కో విద్యార్థికి ప్రతి సంవత్సరం రూ.12వేల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు పర్వేజ్‌తో పాటు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సత్కరించారు. సర్పంచ్ ఇల్లందుల కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు సంధ్య శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ ఎల్లాచారి, దాత రాజిరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, చంద్రమోహన్, రవి, గిరిజ, ప్రభాకర్, రాజేందర్, అనిల్, సిరాజ్ ఉన్నారు.

పాలకుర్తి టౌన్: నేషనల్ మీన్స్ కం స్కాలర్‌షిప్‌కు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల చెందిన 8వ తగగతి విద్యార్థినిలు ప్యారపు హేమ, లకావత్ అఖిల ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాయం శోభారాణి శుక్రవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థిలను ఎస్ఎంఎంఎస్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులు ఓరుగంటి రమేష్, ఎస్ఎంసీ చైర్మన్ జీడి సమ్మయ్య, గంట రవీందర్, ఉపాధ్యాయులు ఉప్పలయ్య, నర్సింహమూర్తి, బలరాం, రవి, విజయ్‌కుమార్, మాలతి, అశోక్‌కుమార్ అభినందించారు.

జనగామ రూరల్: నేషన్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ టెస్టులో మండలంలోని పెద్దపహాడ్ జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన సొడబోయిన దివ్యా ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా వారు అభినందించారు.

రాజధాని ముట్టడిని విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించాలంటూ ఏప్రిల్ 4న చేపట్టనున్న రాజధాని ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పైస రాజశేఖర్ మాదిగ కోరారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన సంగ్రామ యాత్రలో భాగంగా శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్ మండలంలోని ఉప్పుగల్లు, కూనూర్, కోనాయిచలం మీదుగా పాదయాత్రను నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించడంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. నిరసనగా ఏప్రిల్ 4న రాజధాని ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

ఉద్యోగికి సన్మానం



జనగామ: జిల్లా మైనార్టీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కె.నాగరాజు లింగాలఘనపురం మండలం ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీ కాగా, శుక్రవారం జనగామ మైనార్టీ కార్యాలయంలో ఆయనను సన్మానించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సయ్యద్ ఇస్మాయిల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జి.వెంకన్న, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి కోర్నేలియస్, బీసీ సంక్షేమ అధికారి రవీందర్ వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం అందజేత

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికురాలు గాదేపాక సుశీల కుమారుడు ప్రశాంత్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి శుక్రవారం వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సలేంద్ర సోమన్నయాదవ్, బీఆర్ఎస్ మండల నాయకులు చిలువేరు సంపత్, బెల్లి యుగేందర్ బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో గాదెపాక యాకయ్య, యాదగిరి, ఎడవెల్లి రమేష్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

బచ్చన్నపేట: మండలంలోని మన్‌సాన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప రూ.11,111 అందించారు. శుక్రవారం ఆర్థిక సాయం అందించిన అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పంజాల తార, నాయకులు శ్రీధర్‌గౌడ్, గీస సందీప్ జూకంటి గణేష్, సోమిరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

పూర్వ వైభవం తీసుకురావాలి

జఫర్‌గఢ్: గ్రామ స్థాయిలో టీడీపీని బలోపేతం చేయడంతో పాటు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేలా కార్యకర్తలు పాటుపడాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాపర్తి యాకయ్య కోరారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సోమనర్సయ్య, ఎల్లయ్య, రమేష్, భిక్షపతి, సారంగం పాల్గొన్నారు.


ట్యాంకర్లతో నీటి సరఫరా

లింగాలఘణపురం: మిషన్ భగీరథ నీటి సరఫరా మూడు రోజులుగా నిలిచిపోవడంతో మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో ఎల్లమ్మ పండుగ నేపథ్యంలో సర్పంచ్ విజయ్‌మనోహర్ ఆధ్వర్యంలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. మండల కేంద్రంలోని ట్యాంకర్‌తో పాటు సమీప గ్రామమైన బండ్లగూడెం ట్యాంకర్ రెండింటితో నీటిని అందించి పండుగ సందర్భంగా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, కారోబార్ సురేశ్ ఉన్నారు.

రైతులను నిండాముంచిన ప్రభుత్వం

నర్మెట: కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపి రైతులను నిండాముంచిందని బీజేపీ భాగ్యనగర్ ఇన్‌చార్జ్ కేవీఎల్ఎస్ రెడ్డి అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేర తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలసి దీక్ష నిర్వహించిన అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ పారునంది శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఇనాచార్జ్ రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్, కార్యదర్శి బైరగోని ఆంజనేయులు, రాజు, ఉపాధ్యక్షుడు చిర్ర తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి



లింగాలఘణపురం: జనగామ నుంచి మండల కేంద్రం, బండ్లగూడెం, గుమ్మడవెల్లి, జీడికల్, ఆలేరు మీదుగా తార్నాక వరకు గతంలో నడిచిన బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ ఆర్టీసీ ప్రతినిధి రాజుకు సర్పంచ్ విజయ్‌మనోహర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. శుక్రవారం మండల కేంద్రంలో దివ్యాంగులకు 30 ఉచిత బస్సు పాసులను అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు శ్రీనివాసు, స్కూల్ చైర్మన్ స్వామి, నాయకులు వీరయ్య, యాదగిరి పాల్గొన్నారు.